# అంతర్మథనం !

ఒక ప్రముఖ పత్రికాఫీసుకు రాత్రి పది గంటల సమయంలో 'ఫ్యాక్స్' మెసేజ్ వచ్చింది.

అనారోగ్య కారణాల వలన రామలింగం ప్రభుత్వానికి లొంగిపోవాలనుకుంటున్నాడని... ఇకపై సత్ప్రవర్తనతో జనజీవన స్రవంతిలో కలవాలని కోరుకుంటున్నాడని...అతనిపై గల కేసులన్నీ ఎత్తివేయాలనేది..'ఫ్యాక్స్' మసేజలోని సారాంశం!

ఇంకేముంది? తెల్లవారి ఉదయాన్నే అన్ని దినపత్రికల్లో 'ఫాక్స్' మేసేజ్‌ని యధాతధంగ ప్రచురించటం జరిగింది.

రాష్ట్ర పోలీసు శాఖ యావత్తు దినపత్రికలో న్యూస్ చదివి దిగ్భ్రాంతి చెందింది! ఆఘమేఘాలమీద డి.జి.పి. ఈవిషయమై హోం మినిస్టర్‌ని కల్సి విషయాన్ని కూలంకషంగా చర్చించారు.ఇద్దరూ కలిసి సి.ఎం. గారిని కలవటమూ ఈ విషయం బ్రీఫ్ చేయటమూ జరిగింది. రహస్య సమాలోచనలు కొనసాగినయ్ పాత్రికేయులకు సైతం ఏం జరుగుతుందో అంతు చిక్కలేదు.

రామలింగం అలియాస్ లింగం... అలియాస్ రాము అనబడే వ్యక్తి ఛోటామోటా ఉగ్రవాదేం కాదు. ఉద్యమ భవిష్యత్ రచించటంలో... వ్యూహరచన చేయటంలో... రైఫిల్ షూటింగ్‌లో... లాండ్ మైన్స్ పేల్చటంలో.. విధ్వంసం సృష్టించటంలో దిట్ట.

అంచలంచలుగా ఎదిగిన రామలింగం చివరకు రాష్ట్ర కార్యదర్శి స్థాయికి చేరుకున్న ఘనుడు.

ఉద్యమంలో చేరింది మొదలు.. ఆలోచనలకు పదును పెట్టి .. కొత్త వారినెందరినో తనవైపు తిప్పుకుని... వారికి 'బ్రైన్‌వాష్' చేసి... తుపాకీ చేత పట్టించి రైఫిల్ ట్రైనింగ్ ఇచ్చాడు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉద్యమకారులలో బలోపేతం చేసిన ఘనత రామలింగానికే దక్కుతుంది.

తన నేర్పరితనంతో... నైపుణ్యంతో రాష్ట్రాన్ని గడగడలాడించిన వాడు రామలింగం! ఎన్నో పోలీస్టేషన్లు.. రైల్వే స్టేషన్లు... టెలిఫోన్ ఎక్సేంజీలు.. ధ్వంసం చేసిన ఘనాపాటి ఉగ్రవాది. పోలీసుశాఖను ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ల తాగించి వారికి కంటిమీద కునుకు లేకుండా చేసిన వాడు రామలింగం.

అతను నిర్వహించిన అనేక మెరుపు దాడుల్లో ఎంతో మంది పోలీసులు... అమాయకపు ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

వ్యూహరచనలో అతనికెవరూ సాటిరారు! అతని మీద యాభై లక్షల రివార్డు ప్రకటించి

పట్టుకోవాలని... మట్టుపెట్టాలని విశ్వప్రయత్నం చేసినా...ఎత్తుగడ పారనీయని మేధావి రామలింగం.

ఇరవైయేళ్ల ప్రాయంలో ఇంజనీరింగ్‌లో కంప్యూటర్స్ సబ్జక్ట్ చదువుతూ... ఫైనలియర్‌లో విప్లయోద్యమం పట్ల ఆకర్షితుడై.. నేటి సమాజ ధోరణులకు మార్చాలని కంకణం కట్టుకుని... ఇంట్లోవారికి క్కూడా చెప్పకుండా ఒక నాటి రాత్రి అదృశ్యమైనాడు.

ఇరవైయ్యేళ్లపాటు వివిధ కేడర్స్‌లో పనిచేసాడు. పోలీసుల కళ్లు కప్పి తన తెలివి తేటలతో అద్భుత వ్యూహరచనా చాతుర్యంతో తప్పించుకుంటూనే వున్నాడు. అజ్ఞాత జీవితం అడవుల్లో సాగిస్తూనే వున్నాడు.

విప్లవ జీవితంలో కడుపునిండా తిండికి నోచుకోనిరోజులు..కంటినిండానిద్రపోని రోజులు ఎన్నో... ఎన్నెన్నో... రాళ్లరప్పలమీద పడుకోవటం దొరికింది తినటానికి అలవాటు పడ్డాడు.

పోలీసు వారి ఆకస్మిక దాడుల్లో దాచుకున్న తిండి కూడాదక్కకుండా పోయేది కొన్నికొన్నిసార్లు.

నడివయస్సు దాటుతూండగ..శరీరంలో శక్తి సన్నగిల్లటంతో అనారోగ్యంపాలయ్యాడు. అప్పటికీ ఒకటి రెండు సార్లు... సిటీకొచ్చి అత్యంతరహస్యంగ ట్రీట్‌మెంట్ తీసుకుని వెళ్లిపోయాడు.

పాతికేళ్ల పాటు తన శక్తి యుక్తులను ఉద్యమానికే ధారపోశాడు. శ్రమించాడు. నిరంతరం పోరాటాలు సలుపుతూనే వున్నాడు.

ఒకవైపు ఉద్యమంలో విశ్వాసం సన్నగిల్లుతోంది. మరోవైపు శరీరఅస్వస్తత! చేసినంత వరకు చాలుననే తృప్తి రామలిగంలో మిగిలింది. కన్న వారిపై గాలి మళ్లింది. తోడబుట్టిన ఇద్దరు చెల్లెళ్లూ ఎలావున్నారో అన్పించసాగింది.

అతి రహస్యంగ రెండో కంటికి తెలీకుండా మాజీ మంత్రులను... ఎం.ఎల్.ఏ.లను కలిసి తన నిర్ణయంపై కూలంకషంగ చర్చించాడు. వారి సహాయాల్ని కోరాడు. తనపైగల కేసులన్నీ కొట్టివేయించటంలో రాజకీయ పలుకుబడి వారి ద్వారా ఉపయోగించి సి.ఎం.ను ప్రసన్నడుని చేసుకోవాలని ఆరాటపడ్డాడు.

ఇరువురు మాజీ మంత్రులు... నలుగురు శాసన సభ్యులు రామలింగానికి అన్నివిధాలా సాయం అందిస్తామని వాగ్దానం చేయటంతో అతనిలో గల కాస్తంత భయం పిరికితనం దూరమైనట్టన్పించింది. ధైర్యంగా ముందడుగు వేసి తాను స్వచ్ఛందంగా లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోవటానికే నిర్ణయించుకున్నాడు.

అందుకే 'ఫాక్స్' పత్రికలకు పంపేడు!

★★★★★

రామలింగంది బహుపేద కుటుంబం! తండ్రి తల్లీ ఇద్దరూ వ్యవసాయ కూలీలు కావటాన ఏడాదిలో కొన్ని నెలలే సంపాదన! తల్లి ఆరోగ్యం అంతంతమాత్రమే కావటంతో మరో పనికి

పోదు. తండ్రి మాత్రం ఏదో ఒక పనికి పోతూ ఓ పది రూపాయలు రోజూ సంపాదిస్తూంటాడు. వాళ్లకి రామలింగం ఒక్కడే కొడుకు. తర్వాత ఇద్దరూ ఆడపిల్లలే!

అదో చిన్న పల్లె! అంతా కలిసి రెండువేల గడప! డబ్బున్న కుటుంబాలు ఒకటో రెండో వున్నయ్. మిగతా వారంతా కష్టజీవులే! రెక్కాడితే గాని డొక్కాడదు.

అగ్రామానికి త్రాగునీటి సదుపాయం లేదు. గ్రామం మొత్తానికి ఒకటో రెండో బోర్లున్నాయ్. గ్రామస్తుల అవసరాలకు ఆ రెండు బోర్లూ చాలక పోయినా... ఎండా కాలంలో అవి ఎండిపోయినా నాలుగు కిలో మీటర్ల దూరంలో గల చెరువు నీరే అన్ని అవసరాలకూ అధారం. ప్రతి కుటుంబంలోని సభ్యులందరూ ఆడ మగ...చిన్న పెద్ద అనే బేధం మరిచి కావిళ్లతో నీరు తెచ్చుకుని రెక్కలు ముక్కలు చేసుకోవలసిందే!

గ్రామంలో ఎలిమెంటరీ స్కూలుంది! రెండు తరగతులకు సరిపడ పిల్లలుంటారు. ఒక్కడే టీచరు. అతనూ పక్కన పది కిలోమీటర్ల దూరంలో గల మరో వూరి నుండి రోజూ సైకిలు మీద వచ్చి పోతూంటాడు. టీచరు రాని రోజు స్కూల్లో పిల్లలను అదుపు చేసేవారుండరు. కొట్టుకుంటారు. పలకలు పగల్తాయ్. తగాదాలు తీర్చలేక పెద్దలకు చావొస్తుంది.

స్కూల్లో వుండే షుమారు అరవై మంది పిల్లల్లో రామలింగం ఒక్కడే తెలివైన వాడని స్కూలు టీచరు తెగ మురిసి పోతుంటాడు. రామలింగానికి వుజ్వల భవిష్యత్ వుందని రామలింగాన్ని పొగడని రోజంటూలేదు.

వంట్లో బాగుండక పోయినా ఒక్క రామలింగం కోసమే సైకిలు మీద వస్తాడు స్కూలుకి ఆ టీచరు. తన కారణంగా రామలింగం చదువుకుంటు పడకూడదనేదే టీచర్ ఆలోచన! టీచరు దృష్టిలో రామలింగం బ్రిలియంట్ స్టూడెంట్.

కన్నవారు చదువద్దంటూ... ఏదైనా కూలీపనికి పొమ్మని రామలింగాన్ని సతాయిస్తూంటే టీచరు వారిని వారించి పిల్లాడిని చదివించ మంటూ హితవు చెప్పేవాడు.

ఎట్లాగైతేనేం... అయిష్టంగానైనా పక్కవూళ్లోవున్న హైస్కూల్లో చేర్చటానికి వప్పుకోవటంతో రామలింగం తెగ సంబరపడ్డాడు.

పుస్తకాలు కొనుక్కునేటందుక్కూడా డబ్బుల్లేక పోవటం చూచి రామలింగం తెలివికి చదువు పట్ల శ్రద్ధకి మెచ్చి టీచర్లంతా చందాలేసుకుని పుస్తకాలు కొనిచ్చేవారు.

తిన్నా తినకపోయినా రామలింగం ధ్యాసంతా చదువుమీదే! బుడ్డి దీపం ముందు కూర్చుని పరీక్షలప్పుడు తెల్లవార్లు మేలుకుని చదవటం చూచి అతని అమ్మ అయ్య తెగమురిసి పోతూండే వాళ్లు!

టెన్త్‌లో జిల్లా ఫస్ట్ రావటంతో రామలింగం దశ తిరిగింది. స్కూలు హెడ్మాష్టరు రామలింగాన్ని తన డబ్బుతో పై చదువు చెప్పిస్తానంటూ ఇంటర్లో, జాయిన్ కావటానికి దోహదపడటంతో కాలేజీ ప్రాంగణంలోకి ఆనందంగా అడుగు పెట్ట గలిగిన అదృష్టవంతుడైనాడు రామలింగం.

రామలింగం మెరిట్ స్కాలర్‌షిప్ డబ్బుతోటే ఇంటర్ చదివాడు. ఇంటర్లో స్టేట్ ఫస్టొచ్చాడు. ఇంకేముంది ఇటు ఎరిగిన వారు అటు ప్రభుత్వం ఆదుకున్నారు. ఎన్ట్రెన్స్ టెస్ట్‌రాసిన రామలింగం ఇంజనీరింగ్ సీటు సంపాదించుకో గలిగిన అదృష్టవంతుడైనాడు.

బి.టెక్ ఫైనలియర్లో వుండగా బుద్ధుడికి జ్ఞానోదయమైనట్టు.. రామలింగంలో... ఈ సమాజ స్థితి గతులను మార్చాల్సిన అవసరం వున్నదన్పించటంతో రెండో కంటికి తెలీకుండా ఒకనాటి రాత్రి కాలేజీ హాస్టల్ నుండి ఎవ్వరికీ కన్పించకుండా పోయాడు.

ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు రామలింగం కాడని ఇటు ఫ్రెండ్స్, అటు ప్రొఫెసర్స్ తేల్చారు. కానీ అతనేమై పోయిందీ పోలీసులు సైతం అచూకీ కనిపెట్టలేక పోయారు. తల్లీతండ్రి కన్పించకుండా అదృశ్యమైపోయిన కొడుకు రామలింగం గురించి భోరున ఏడ్చారు. గుండెలు బాదుకున్నారు. తల్లిదిగులుతో మంచం పట్టింది.

★★★★★

గాలి నీరు తిండి అన్నీ రామలింగానికి అడవితల్లి వొడిలోనే! తన తెలివిని శ్రమను విప్లవోద్యమానికి ధారపోయటానికే నిర్ణయించు కున్నాడు.

నిరుద్యోగ యువతను ఆకర్షించి ఆకట్టుకుని కేడర్‌ని పటిష్ఠం చేయగలిగిన ఘనత రామలింగానికే దక్కింది.

అప్పుడప్పుడు పుట్టి పెరిగిన గ్రామం..కన్నతల్లీ తండ్రీ... తోడబుట్టిన ఇద్దరు చెల్లెళ్లు గుర్తుకొచ్చినా గుండె రాయి చేసుకునేవాడు.

హు! తాను పుట్టి పెరిగింది వూరా అది?-

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు దాటినా తన గ్రామం ఏ సదుపాయానికీ నోచుకోలేదు.

రోడ్డు లేదు. తాగునీటికి కటకట!...

ఎలిమెంటరీ స్కూలు తప్ప గతిలేదు. ఒక ఆసుపత్రి లేదు..

వైద్యం కోసం పదిహేను కిలోమీటర్లు పోవలసిందే!

తాను పట్టుదలతో ఎంతటి శ్రమకోర్చి కష్టపడి చదివి పైకొచ్చాడో తన అంతరాత్మకి తెలుసు!

చెల్లెళ్లిద్దరూ చిన్నవారు కావటంతో అన్ని పన్లూ తానే చక్కపెట్టుకోవలసి వచ్చేది. తల్లి ఆరోగ్యం అంతంత మాత్రమే! తండ్రి రెక్కలు ముక్కలు చేసుకోవటానికి తెల్లారకముందే పక్కవూళ్ల కెళ్లి పదో పరకో సంపాదించి ఏ రాత్రికో ఇల్లు చేరుకునేవాడు.

అంతటి దరిద్రంలోనూ సహృదయుల సహకారం వలన తాను చదువు కొనసాగించ గలిగాడు.

రాజమ్మ ఆశలన్నీ రామలింగంమీదే! కొడుకు కలక్టరవాలని కలలు కనేది. కొడుకు

చదువులో వృద్ధిలోకి రావటం చూస్తూ తెగమురిసేది! కొడుక్కి మంచి వుద్యోగంవస్తే వాడు తెల్లగుడ్డ లేసుకుని కార్లలో తిరుగుతాడు. ఇంటిల్లి పాదికీ కడుపునిండా తిండికి లోటుండదు. దర్జాగ బంగళాలో వుండచ్చు. ఎన్నో ఎన్నెన్నో రకాలుగా వూహించుకుంటూ ఊహల్లో రాజమ్మ తేలిపోతూండేది.

హాస్టల్లో వుండి చదువు కుంటున్న రామలింగం సెలవుల్లో ఇంటికొచ్చేవాడు. సంవత్సరాలు గడుస్తూన్నా రవంతైనా మారని తన గ్రామం గురించే బాధపడేవాడు.

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ఆయన పోగానే, ఆయన ఆశయాలూ కొండెక్కినయ్. ఆయనను ఆయన సదాశయాలను మర్చిపోయారు అందరూ!

నాయకత్వలోపాలు... ప్రజల పట్ల నిర్లక్ష్య ధోరణి... గ్రామాల జీవన విధానాన్ని మార్చటానికి ప్రయత్నించక పోవటం... అవినీతి ... లంచగొండితనం... స్వార్థ చింతన... కులరాజకీయాల పట్ల నేతల ఆసక్తి బడుగు బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేయటం.. వంటివి చూస్తూ రామలింగం ఎదిగే మనసు చలించిపోయేది. రగిలిపోయేది!

తల్లికి అనారోగ్యం ముదిరి ఇక చనిపోతుందేమోనే భీతితో రెండెడ్ల బండిమీద ఆస్పత్రి వున్న వూరికి తీసుకు పోగా.. అక్కడ వైద్యం చేసే డాక్టర్ డ్యూటీకి పది రోజులుగా రావటం లేదని తెల్సి రామలింగం పసి ఋసను మూగగా రోదించింది. అక్కడున్న ఇతర ఆస్పత్రి సిబ్బంది మీద తిరగబడ్డాడు... అయినా ప్రయోజనం లేక పోవటంతో అక్కడే నాటువైద్యుడ్ని ఆశ్రయించి తల్లి అనారోగ్యం నుండి కోలుకున్న తరువాత ఇంటికి చేరుకున్నాడు.

రామలింగంలో తిరుగుబాటు ధోరణికి సరిగ్గా అప్పుడే అంకురార్పణ జరిగింది.

ఇంటర్ చదివే రోజుల్లో విద్యార్థి నాయకుడై అనేక సమస్యలను ధైర్యంగాఎదుర్కొన్నాడు. అవిశ్రాంతంగా పోరాటాలు జరిపాడు. రాస్తారోకోలు.. ధర్నాలు... బంద్‌లకు 'స్ట్రైకులకు పాల్పడాల్సి వచ్చింది. కోర్కెల సాధనకై... సరికొత్త వ్యూహరచన చేయటానికి పూనుకునేవాడు.

బస్సుల దహనం... అద్దాలు పగుల కొట్టడం... టైర్లో గాలితీయటం వంటి వాటిని ప్రేరేపించేవాడు.

ఇన్ని వ్యాపకాలున్నా... మనిషిలో ఎంతటి వుద్రేకం వున్నా.. చదువును నిర్లక్ష్యం చేసేవాడు కాదు. మోస్ట్ ఇంటలిజెంట్ స్టూడెంట్‌గా లెక్చరర్ల మధ్య గొప్ప పేరు సంపాదించుకుంటూ వచ్చేవాడు.

ఈ సమాజాన్ని రాజకీయాలను బాగుచేయాలనేదే రామలింగంలో కలిగి చెలరేగిన ఆలోచన! ఆశయ సిద్ధికోసమే... పేద బలహీన వర్గాల బతుకుల్లో మార్పు తేవాలనే ఆరాటంతోనే తాను అడవి తల్లి ముద్దు బిడ్డడైనాడు.

★★★★★

అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన రామలింగం... విప్లమోద్యాలకు రూపకర్తయై.... అందరికీ తల్లో

నాలుకలామెలిగి... అంచలంచలుగా ఎదిగి రాష్ట్ర కార్యదర్శి స్థాయికి చేరుకున్నాడు.

తన ఇరవైయేళ్ల అనుభవంలో ఎన్నో పోరాటాలకు వూపిరి పోసాడు విధ్వంసక చర్యలు చేపట్టి యావత్ రాష్ట్రాన్నీ ఒక కుదుపు కుదిపాడు! గడగడలాడించాడు!

అతనిపై ఎన్నో కేసులు బనాయంచింది ప్రభుత్వం. అయినా వెరవలేదు. తెలివిగా తప్పించుకుంటూ కేడర్ అభివృద్ధికి పాటుపడుతూనే వున్నాడు.

సరిగ్గా ఉద్యమంలో చేరిన రెండవ సంవత్సరం తానే కమల అనే సహాధ్యాయినితో ఏర్పడిన స్నేహం. ప్రేమగా మారి ఇద్దరూ రహస్యంగా వివాహం చేసుకుని ఒకటయ్యారు.

★★★★★

ఎన్నెన్ని ఘాతుకాలకు వొడిగట్టాడు? కిరాతకంగ ఎందరిని పొట్టనపెట్టుకున్నాడు? మరోవైపు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసాడు. ఇలాంటి మానవమృగాన్ని శిక్షించకుండా వదిలేయటమా? చట్టం బారి నుండి తప్పించటమా? ఇతగాడేమైనా దేశ నాయకుడా? ఇలాంటి క్రిమినల్‌ని విప్లవకారుణ్ణి జనజీవన స్రవంతి లోకి వదిలేయటమా? నో?? డి.జి.పి. హోంమంత్రి..సి.ఎం.. ముగ్గురూ తలలు అడ్డంగా అడించారు.

చింతామణి ప్రాతివత్యం లాంటిదే ఇదేనూ? ఇన్నాళ్లూ చంపి దోచుకున్న మనిషి. ఇప్పుడు వయసుడిగేక అనారోగ్యం బారిన పడ్డాడు కదాని జాలి చూపటమా? పాముకి పాలు పోయటమే అవుతూంది..." డి.జి.పి. తన మనసులో ఆలోచన వెలిబుచ్చాడు.

వారు ముగ్గురూ ఎలాంటి నిర్ణయం తీసుకున్నదీ ఎవరికీ తెలియనీయలేదు. అత్యంత గోప్యంగా తమ నిర్ణయాన్ని దాచి వుంచారు.

అత్యంత రహస్యంగ కల్సుకుని తన నిర్ణయాన్ని చెప్పి తనను కాపాడాల్సిందిగా కోరి.. సిఎంకు రికమెండ్‌చేయవలసిందిగా ప్రాధేయపడిన మాజీ మంత్రి... శాసన సభ్యులు 'సరే'నని తలూపి తర్వాత మొండిచేయి చూపారనే యదర్థాన్ని గ్రహించాడు రామలింగం.

తాను లొంగిపోతే మెడకు వుచ్చు తప్పక బిగుసు కుంటుందని గ్రహించిన మేధావి రామలింగం! కళ్ల నీళ్లు పెట్టుకుని కాళ్ల మీద పడినా జాలి పడకపోవచ్చు ప్రభుత్వం!

ముందు కస్టడీలోకి తీసుకుంటా మంటారు... తర్వాత ఛార్జిషీటు కోర్టులో దాఖలుచేస్తారు. కోర్సు తనకు శిక్ష విధిస్తుంది. జామీను ఇవ్వటానిక్కూడ కోర్టు నిరాకరిస్తుంది. తన ఆరోగ్య పరిస్థితి పట్ల కనికరం చూపక పోవచ్చు!

అప్పుడు తన ఆశలు వమ్మవుతాయ్! తన ఆలోచన నిర్ణయం తల్లకిందు లౌతుంది.

ఇవన్నీ ఆలోచిస్తుంటే... చావు భయం రామలింగాన్ని ఆవహించింది. గుండె వేగం పెరిగింది. మనసు వికలమైపోయింది.

స్వచ్ఛందంగ లొంగిపోతే తన చావుని కోరి తెచ్చుకున్న వాడవుతాడేమోనని భీతి రామలింగాన్ని

కలవరపెడుతోంది. తాను ఎందరినో అమానషంగా చంపాడు. ఎందరో వుసురుపోసుకున్నారు. నిర్దయంగా తుపాకీ తూటాలకు ఎందరినో బలిగొన్నాడు. ఎన్నో ఆస్తులను ధ్వంసం చేశాడు.

అలాంటి తనకు.... ఇప్పుడు చావంటే భయమేస్తోంది! ఒక్కసారి చేతికి చిక్కేక ప్రభుత్వం పోలీసులు, చట్టం తనకు మనశ్శాంతి లేకుండా చేస్తుంది. క్రూరంగా శిక్షిస్తుంది. అది తను భరించలేడు.

లొంగి పోవటమనే తన నిర్ణయం సరైనది కాదేమో? తొందరపాటు నిర్ణయం తీసుకున్నాడేమో అన్పిస్తోంది.

హూ! తానెంతటి స్వార్థపరుడు? ప్రాణమంటే తీపిలేని వారెవరు?-ఇదేమిటి? ఇట్లా ఆలోచించటమేమిటి? తన్లాంటి విప్లవకారుడు మృత్యువుకి భయపడి పిరికి వాడు కాకూడదు.

లొంగిపోవుటకంటే ఈ వూపిరి వున్నన్నాళ్లు అడవినే నమ్ముకుంటే ఆనందంగా వుంటుంది! అప్పుడు తన జన్మ చరితార్థమౌతుంది!

తల్లీ తండ్రి ముసలివారై చనిపోయి వుంటారు. ఇద్దరు చెల్లెళ్లూ వివాహం చేసుకుని సుఖంగా భర్తతో కాపురం చేసుకుంటూ పిల్లలను కంటూవుంటారు.

తన భార్య అని చెప్పుకున్న ఆత్మీయురాలు ఎన్నడో కన్నుమూసింది. ఇక తాను వంటరివాడు! బతికితేనేం? చస్తేనేం? తన గురించి కన్నీరు పెట్టేవారు... ఏడ్చేవారు ఎవరూ లేనట్టే...

'నో! నేను లొంగిపోను... లొంగిపోను... చట్టం చేతిలో చిత్రవధ అనుభవించలేను. ఈ అడవిలో చెట్లే నా తల్లి, తండ్రీ, భార్య, కొడుకు, తోబుట్టువులు... అన్నీను! ఊపిరి పోయే చివరి ఘడియ వరకు... అనారోగ్యంతో నరక యాతన అనుభవిస్తున్నా.. అడవిలోనే వుంటూ నా చరమ జీవితాన్ని ఇక్కడి పకృతికే అంతం చేయటం సరైన నిర్ణయం! ఈ విషయం గురించి ఇన్ని విధాలుగా అంతర్మథనానికి లోబడటం అనవసరం!... అవివేకం... 'మగత నిద్రనుండి మేల్కొన్న రామలింగం పెద్దగ గావుకేకలు పెడుతూ దిక్కులు పిక్కటిల్లేటట్టు... తన స్వయం నిర్ణయం మార్మోగే విధంగా అరిచాడు. కేకలు పెట్టాడు. గుండె బాదుకున్నాడు. రెండు కన్నీటి బొట్లు రాల్చాడు! తనకు తనే ధైర్యం చెప్పుకుని తన లొంగుబాటు నిర్ణయాన్ని మార్చుకున్నాడు.

-:(సమాప్తం):-